క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

బెల్లం ఊట ధ్వంసం



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: నవోదయం 2.0లో భాగంగా గురువారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రణమండల కొండల్లో 450 లీటర్ల బెల్లంఊటను, నాటుసారా బట్టీని ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ తెలిపారు. పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ కార్తీక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

నివాళి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 34వ వార్డులోని లక్ష్మీపేటకు చెందిన శ్రీనీలకంఠేశ్వర స్వామి తేరు అలంకరణ నిర్వాహణ కమిటీ సభ్యుడు కనికే ఈరన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన భౌతిక కాయానికి గురువారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో 34వ వార్డ్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రమేష్, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం అంజి, నాయకులు వడ్డే వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: శ్రీచైతన్య పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, అబ్దుల్‌ఖాదర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్నారని విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ సంఘ నాయకులపై పోలీసులు దాడి చేయడం శోచనీయమన్నారు. అరెస్ట్ చేసిన సంఘ నాయకులను విడుదల చేసి శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని పాత బస్టాండు వద్ద బొబ్బిలి అనే వ్యక్తిని కులం పేరుతో దూషించి దాడి చేసినందుకు సన్నప్ప అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. ఈనెల 10వ తేదీన అరంజ్యోతినగర్‌కు చెందిన బొబ్బిలి, వీరేష్‌లు బైకుపై వెళ్తుండగా వారిద్దరిని పాత బస్టాండు సమీపంలో సన్నప్ప అనే వ్యక్తి ఆపి బొబ్బిలి అనే వ్యక్తిపై కులం పేరుతో దూషించి దాడి చేశారని తెలిపారు. బొబ్బిలి ఫిర్యాదు మేరకు గురువారం సన్నప్పపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

బైకు ట్రాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆదోని రూరల్: ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే పార్థసారథి చేతులమీదుగా గురువారం బైకు ట్రాలీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండిగిరి గ్రామ అభివృద్ధిలో భాగంగా వివిధ కాలనీల్లో ఇంటింటి చెత్త సేకరణ కోసం వినూత్న రీతిలో బైకు ట్రాలీని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండిగిరి ప్రత్యేకాధికారిణి నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు రూరల్: ఐటీఐ కోర్సు చదివేందుకు రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



నందవరంలో భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య



నాగలదిన్నె బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలు

నందవరంలో నిత్యం ట్రాఫిక్ జాం

- నాగలదిన్నె బ్రిడ్జి పూర్తి కావడంతో పెరిగిన రాకపోకలు
- భారీ, అతి భారీ వాహనాలతో గ్రామంలో పెరిగిన రద్దీ
- స్థానికులకు తలనొప్పిగా మారిన ట్రాఫిక్
- బైపాస్ నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు

నందవరం : తుంగభద్ర నదిపై నాగలదిన్నె బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ప్రజలు సంతోషించారు. రాకపోకల కష్టాలు తీరడంతో ఊపిరి పీల్చుకున్నారు. బ్రిడ్జిపై రాకపోకల ప్రారంభంతో వాహనాల రద్దీ పూర్తిగా పెరిగిపోయింది. అయితే ఈ రద్దీ నందవరం వాసులకు తలనొప్పిగా మారింది. రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు

నాగలదిన్నె బ్రిడ్జిపై నుంచి వెళ్లే భారీ, అతి భారీ వాహనాలు మండల కేంద్రం నందవరం నడ్డిబొడ్డు నుంచి వెళ్లాల్సి ఉంది. వాహనాల రద్దీ కారణంగా మండల వాసులకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు గ్రామానికి వెలుపల బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే మున్ముందు తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బైపాస్ నిర్మించాలి



మా గ్రామంలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఈ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. నాలగలదిన్నెలో తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో మండల కేంద్రం నందవరంలో వాహనాల రాకపోకలు తీవ్రతరమైంది. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. మా గ్రామంలో బైపాస్ నిర్మాణం చేపట్టాలని మండల అధికారులకు కూడా వినతి పత్రాలను అందించాం. ఉన్నత అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఊరి బయట బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. – గవ్వల నారాయణ, నందవరం

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం: డిజిటల్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. గురువారం మండల పరిధిలోని హాల్వి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు చెడు వ్యసనాలు, చెడు సహవాసాలు, డిజిటల్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో పాటు కొంతమంది దీనిని చెడు మార్గాలలో ఉపయోగించుకుని నేరస్తులుగా మారుతున్నారన్నారు. ఇందుకు కారణం చెడు వ్యసనాలు, చెడు స్నేహాలేనన్నారు. సెల్‌ఫోన్‌లను సరైన పద్ధతిలో ఉపయోగించుకోకుండా బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుని నేరస్తులుగా మారుతున్నారన్నారు. ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అలాగే నదిచాగి, రౌడూరు ఫ్యాక్షన్ గ్రామాల పికెట్లను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ అశోక్‌కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ భాస్కర్

కౌతాళం: క్షయ వ్యాధిపై జాగ్రత్తలు అవసరమని టీబీ నివారణ జిల్లా అధికారి భాస్కర్ అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్‌లో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మట్లాడుతూ అనుమానం వున్నవారు క్షయ నిర్ధారణ పరీక్షలు అయినటువంటి గళ్ల పరీక్ష చేయించుకోవాలని, అలాగే ఎక్స్‌రే తీయించుకోవాలని సూచించారు. వీటిని కౌతాళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, సూపర్‌వైజర్లు స్వరూప, భాస్కర్ ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సూగూరులో క్షయ వ్యాధి శిబిరం

మంత్రాలయం రూరల్ : మండలంలోని కాచాపురం పీహెచ్‌సీ పరిధిలోని రాంపురం గ్రామంలో గురువారం క్షయ వ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారిణి డా. వసంత నేతృత్వంలో గ్రామంలో వెద్య పరీక్షలు చేపట్టారు. టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూజర్ వైజర్ మాధవస్వామి, టీబీ వ్యాధి సూపర్ వైజర్ మల్లికార్జున, చాంద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామ అడవుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ గురువారం తెలిపారు. ఆదోని పట్టణంలోని కౌడల్‌పేటకు చెందిన వగ్గా నాగరాజు, ఇస్వీ గ్రామానికి చెందిన రాముడు, మదిరె గ్రామానికి చెందిన శేఖర్‌తో పాటు మరో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,460 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఐటీ చట్టం కింద కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విజయ్ అనే వ్యక్తి స్వయం సహాయక సంఘాల ఆర్‌పీలపై అసభ్యకరమైన పోస్టింగ్ చేసినందుకు టూటౌన్ పోలీసులు ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) చట్టం కింద గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని విజయ్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రాంలో ఆర్‌పీలపై అసభ్యకరమైన బూతులు పెట్టడంతో ఆర్పీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆ పాఠశాలను సీజ్ చేయాలి


ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పట్టణంలోని భాష్యం పాఠశాలను విద్యాశాఖ అధికారులు సత్వరం సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలోని భాష్యం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, ధనుష్, ప్రమోద్, తన్వీర్, ప్రవీణ్, సూర్య తదితరులు పాలొన్నారు.

సమయపాలన పాటించాలి

నందవరం : సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ పుల్లయ్య ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..సచివాలయాల్లో గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ప్రస్తుతం తల్లికి వందనం గ్రీవెన్స్, రేషన్ కార్డులు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం వస్తున్న వారికి సేవాలందించాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 21న యోగా దినోత్సవం విజయవంతం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి ఈఓపీఆర్డీ అడ్డంకిగా మారారు

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన
- టీడీపీ నాయకుల ప్రోద్బలంతో బిల్లులు చేయడంలేదని ఆరోపణ



ఈఓపీఆర్డీ జయరాముడుతో వాగ్వాదానికి దిగిన సర్పంచ్ రామాంజినేయులు

పెద్దకడబూరు : మండలంలో పని చేస్తున్న ఈఓపీఆర్డీ జయరాముడు మండల అభివృద్ధికి అడ్డంకిగా మారారని పెద్దకడబూరు, కల్లుకుంట సర్పంచ్‌లు రామాంజినేయులు, ఇస్మాయిల్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన, ఎంపీడీఓ ప్రభావతి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఇటీవల చనిపోయిన చిన్నతుంబళం– 2 ఎంపీటీసీ సభ్యురాలు బడెమ్మ ఫొటోకు పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ పరిధిలోని గ్రామాలలో ఏమైనా అభివృద్ధి పనులు చేపడితే ఈఓపీఆర్డీ బిల్లులు చేయడంలేదని సభాధ్యక్షుల ముందు వాపోయారు. ఏమని చేయాలన్నా ఆయన అడ్డుపడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 20మంది సర్పంచ్‌లులో 19మంది వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు ఒక్కరు మాత్రమే టీడీపీ ఉండడంతో ఎవరో టీడీపీ నాయకులు కావాలనే తాము చేసే పనులు ఆయన చేత అడ్డుకుంటున్నారని ఆరోపణలు చేశారు. దీంతో ఈఓపీఆర్డీ జయరాముడు, సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. సభాధ్యక్షులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

మండలంలో రెవెన్యూ సమస్యలే లేవా?

మండలంలో మండల అభివృద్ధి కోసం మూడు నెలలకు ఒకసారి జరిగి సర్వసభ్య సమావేశానికి రెవెన్యూ అధికారులే రాకపోవడం అంటే మండలంలో రెవెన్యూ సమస్యలే లేవా అని ప్రత్యేకాధికారి నాగరాజురావు మండిపడ్డాడు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలి

మండలంలో పని చేస్తున్న ప్రతిశాఖ అధికారులు కచ్చితంగా మండల మీట్‌లో హాజరై అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ఎంపీపీ శ్రీవిద్య కోరారు. మండలంలో కొంతమంది అధికారులు సర్వసభ్య సమావేశం అంటే నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు ముత్తమ్మ, ఇర్ఫాన్ దేశాయి, కో – ఆప్షన్ సభ్యుడు షేక్‌ఖాన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: విద్యా మాఫియాకు అడ్డుకట్ట వేయాలని అడిగితే ఏఐఎస్‌ఎఫ్ నాయకులపైన దాడులు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి యు.దస్తగిరి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ చైతన్య కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. వెంటనే అరెస్టు చేసిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, శివ, వీరేష్, వినయ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలో పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం సత్వరం పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం మల్కాపురం గ్రామ సీపీఐ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులైన ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల, వేదావతి, గురురాఘవేంద్ర ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించక పశ్చిన ప్రాంత రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి తక్షణం రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రంగన్న, బాస్కర్‌యాదవ్, రాజీవ్, బజారి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సచివాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఎస్ఎస్ ట్యాంకు నుంచి లేదా దూరంలోని వంకలు, వాగుల్లో నుంచి నీటిని తెచ్చుకుని తాగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో నూతన పైపులైన్ వేయించాలని, తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిక్కప్ప, పరమేష్, రామప్ప, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: ఆర్ఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గురువారం ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ఉన్న ఆర్.ఎస్. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కూల్ ఎలాంటి అనుమతులు లేకుండా ముందే అడ్మిషన్ ప్రారంభిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తుందన్నారు. బుధవారం రోజున అధికారులు తనిఖీకి వచ్చిన సందర్భంగా అప్పటికప్పుడు వేరే కళాశాల భవనాన్ని చూపించి అధికారులను బురిడీ కొట్టించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉత్తేజ్, లోకేష్, ఉదయ్, ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు.

'బార్' ఎన్నికలు రద్దు చేయాలి'

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలు బైలాస్ ప్రకారం జరగలేదని సీనియర్ న్యాయవాది సునీతారెడ్డి, అనితాబాయి ఆరోపించారు. గురువారం వారు మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికలు బైలాస్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని, తక్షణమే ఎన్నికలను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జోక్యం చేసుకుని ఎన్నికలను రద్దు చేయాలని కోరారు.

మరమ్మతులు చేయించండి

ఎమ్మిగనూరురూరల్/టౌన్: శిథిలమైన ఎల్ఎల్‌సీ కాలువ షట్టర్లకు మరమ్మతులు చేయించి రైతులకు న్యాయం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక ఎల్ఎల్‌సీ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎల్ఎల్‌సీ కాలువ పరిధిలోని 79, 80, 81, 82, 82, 86 నంబర్ షట్టర్లు శిథిలమయ్యాయన్నారు. అనంతరం ఎల్ఎల్‌సీ ఏఈ మణికంఠకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయ కులు నల్లన్న, బజారి, మహేంద్ర, అగస్టిన్, బాబు, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి



రాఘవేంద్ర సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఆర్డీటీ సంస్థ సభ్యులు, లబ్ధిదారులు



ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంత్రాలయం రూరల్ : గ్రామీణ ప్రాంత పేద ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థ సేవలకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేయడాన్ని నిరసిస్తూ సంస్థ సభ్యులు, లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. గురువారం మంత్రాలయం మండల కేంద్రంలోని రాఘవేంద్ర సర్కిల్ సంస్థ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా ఆందోళనకు దిగారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ధర్నా చేపట్టారు. సంస్థ లబ్ధిదారులు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ గ్రామీణ ప్రాంతంలోని పేదల విద్యాభివృద్ధి, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు, ఇళ్ల నిర్మాణాలు, తాగునీటి సౌకర్యాల కల్పన కోసం శ్రమిస్తోంది. అలాంటి సంస్థ ఎస్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకుండా ప్రభుత్వం మొండికేయడం తగదన్నారు.

ఆర్డీటీ సేవలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

ఆదోని రూరల్: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేద ప్రజల కోసం స్థాపించిన ఆర్డీటీ సంస్థ ద్వారా అందించే సేవలకు విఘాతం కలిగిస్తే ఊరుకోమని సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, సీడీసీ లీడర్లు అన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

- కౌతాళం: ఆర్‌డీటీ సేవల్ని కొనసాగించేల కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఆర్‌డీటీ నుంచి సేవలు అందుకున్న లబ్ధిదారులు, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి తహసీల్దారు రజనికాంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. దళిత సమాఖ్య నాయకుడు విజయ్‌కుమార్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, జైభీమ్ అధ్యక్షుడు అవతారం, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.
- కోసిగి : ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సేవలను కొనసాగించాలని విద్యార్థి సంఘం నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, సీపీఐ నాయకులు ప్రకాష్, నరసింహులు కోరారు. గురువారం వివిధ గ్రామాల ప్రజలతో కలసి స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు.

ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలి

గోనెగండ్ల : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ(ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులర్ ఆక్ట్) పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు బాబు భాస్కర్, బజారి కోరారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రం గోనెగండ్లలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు వైస్ చైర్మన్, కౌన్సిలర్ల మద్దతు



దీక్షలో పాల్గొన్న కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు



ఒంటికాలిపై నిల్చొని యోగా చేస్తూ నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె గురువారానికి 16వ రోజుకు చేరుకుంది. సమ్మెలో కూర్చున్న వారికి మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, ఫయాజ్, బాలాజీయాదవ్, కిషోర్, మమ్మత్తు స్వామి, రామకృష్ణ, చలపతి, అశోక్, గోవిందు తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షల్లో పాల్గొన్న కార్మికులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. వారి ఖర్చుల కోసం రూ.5 వేలు నగదును సాయంగా అందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. టెక్నికల్ వాళ్లకు రూ.29,200, నాన్ టెక్నికల్ వారికి రూ.24,500 జీతాలు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు.


వినూత్న నిరసన


ఎమ్మిగనూరుటౌన్: తమ సమస్యల సాధనకై మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు గురువారం సోమప్ప సర్కిల్‌లో ఒంటి కాలిపై నిలబడి యోగా చేస్తూ ప్రభుత్వ మొండి వైఖరి పట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

అక్రమ దందా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రకరకాల అక్రమ దందాలు కొనసాగిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, గోపాల్, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి





ఆదోనిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కౌతాళంలో దళిత సంఘాల రాస్తారోకో

ఆదోని రూరల్: దళిత సర్పంచ్‌ని అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది డిమాండ్ చేశారు. గురువారం ఆదోని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, డీఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ధణాపురంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో సర్పంచ్‌ను ఎస్సీ అని, అందుకే ఆలయం కట్ట ఎక్కరాదని అవమానపరిచారన్నారు. కార్య క్రమంలో నాయకులు దాసరి నరేష్, భరత్, రంగస్వామి, హనుమప్ప, మల్లికార్జున, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయండి

కౌతాళం: దళిత సర్పంచ్‌ను అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, తెలుగుదేశం నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత సంఘాలతో రాస్తారోకో చేపట్టారు. కేవీపీఎస్ నాయకులు చిన్న మారయ్య, వీరేష్ జైభీమ్ నాయకులు కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

కోసిగి : దళిత సర్పంచ్‌ను అవమానానికి గురి చేసిన నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని కేవీపీఎస్ మండల కమిటీ నాయకులు హనుమంతు, బొజ్జప్ప, ఫిలిప్, మల్లి, నరసన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సభలో దళిత సర్పంచ్‌ను వేదిక మీదుకి ఆహ్వానించకుండా వివక్షత ప్రదర్శించి అవమానానికి గురిచేసిన బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు.

ఎమ్మిగనూరుటౌన్ : ఆదోని మండలం ధనాపురం సర్పంచ్‌ను అవమాన పరిచిన ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మన్న, చిన్నప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన కూటమి ఎమ్మెల్యే పార్థసారథిపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు సుజ్ఞానమ్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నరసన్న, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గంగన్న డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ దళితులంటే ఎమ్మెల్యేకు ఎందుకు అంత చిన్నచూపు అని ప్రశ్నించారు.

గోనెగండ్ల : దళిత సర్పంచును అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి వివక్ష ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కిష్టన్న, తిమ్మప్ప, రంగస్వామి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.